స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు

• నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-కోటగిరి

మిషన్ భగీరథ కాదు.. మురికి నీరు' అనే శీర్షికన నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అందులో భాగంగా గురువారం వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. అలాగే మంచి నీటిని సరఫరా చేసే స్థలాన్ని సందర్శించారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.

నవతెలంగాణలో ప్రచురితమైన కథనం


నవతెలంగాణ
మిషన్ భగీరథ కాదు..
మురికి నీరు
• అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

ప్రజాపాలన ఆన్లైన్ ప్రక్రియ పరిశీలన

నవతెలంగాణ-బోధన్




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులు స్వీకరించిన దరఖాస్తులను ఆన్లైన్ కేంద్రాలలో వాటిని కంప్యూటరీకరణ చేయడంతో మున్సిపల్ రాష్ట్ర అధికారులు గురువారం బోధన్ పట్టణంలోని ఎస్ఆర్ కంప్యూటర్ కేంద్రంలో దరఖాస్తుల ఆన్లైన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రీజనల్ డైరెక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు ఆన్లైన్ చేశారు?, ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కంప్యూటర్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

పండుగకు పస్తులే

• రెండు నెలలుగా వేతనాల్లేవ్..
• ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆవేదన
• జిల్లాలో 910 మంది..

నవతెలంగాణ-బోధన్



విద్యా శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు గత రెండు నెలలుగా నవంబర్, డిసెంబర్ వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండుగ సమీపించడంతో పండుగ చేసేది ఎలా అంటూ ఉద్యోగులు మదనపడుతున్నారు.

చాలీచాలని వేతనాలతో 20 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నా ఎప్పటికైనా తమ ఉద్యోగాలను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తుందన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు. గత తెలంగాణ ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులకు న్యాయం చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినా.. మాట నిలబెట్టుకోక తీరని అన్యాయం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు లేక వేతనాలు మంజూరు చేయడంలో ఇబ్బందులు తలెత్తినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పలు కార్యక్రమాల అమలులో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. సమగ్ర శిక్ష, కేజీబీవీ, యుఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలలో, మైనార్టీ గురుకులాల ఒప్పంద ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆయా ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ పథకంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిధులు మంజూరు చేయవలసి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం తనవంతు వాటాను మంజూరు చేసిన గత రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడంతో ఇంతవరకు వేతనాలు జమ కాక సమస్య ఏర్పడిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతుంది. అసలే చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతుంటే అవి కూడా సమయానికి రాక ఇబ్బందుల పాలవుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 910 మంది ఉద్యోగులు..

జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 910 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మండల విద్యాధికార్యాలయంతో పాటు భవిత కేంద్రాలు, కస్తూర్బాగాంధీ విద్యాలయం, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో విధులు నిర్వహిస్తున్నారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో 571 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. అర్బన్ రెసిడెన్స్ స్కూళ్లలో 10 మంది బోధన బోధనేతర సిబ్బంది, డిపిఓ కార్యాలయంలో 9 మంది, 22 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, 29 మంది సిసిఓలుగా, 94 మంది సీఆర్పీలుగా, 49 మంది ఐఈఆర్పీలుగా, 19 మంది మెసెంజర్లుగా, 88 మంది పీటిఐలు, 19 మంది సీజీబీలు ఆయా విభాగాల్లో పని చేస్తున్నారు. వీరికి వారి ఉద్యోగాలను బట్టి 5500/- నుంచి గరిష్ఠంగా 25 వేల వరకు వేతనం పొందుతున్నారు. కానీ ఆ వేతనాలు ఇప్పటివరకు మంజూరు కాకపోవడంతో సంక్రాంతి పండుగను కుటుంబంతో ఎలా జరుపుకోవాలని మదన పడుతున్నారు. 20 రోజులకు పైగా సమ్మె చేపట్టినా.. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించలేదని, కనీసం కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని, రెండు నెలల బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి

గత రెండు నెలల నుంచి వేతనాలు సకాలంలో రాక సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెండు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలి. సమగ్ర శిక్ష ఉద్యోగులను ఆదుకోవాలి.
దండు విజయ్,
సమగ్ర శిక్ష జిల్లా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంక్షేమ పథకాలపై అయోమయం

గ్యాస్ ఏజెన్సీల వద్ద, పోస్టాఫీసుల వద్ద జనం క్యూ

నవతెలంగాణ-వర్ని


MADHAVA SAI GAS AGENCY

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలు అయోమయం చెందుతున్నారు. ప్రభుత్వం ఇటీవలే అర్హులైన వారి నుంచి ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. అయితే ఆ దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును సైతం చేపడుతున్నారు. ఇదిలా ఉండగా.. గ్యాస్ ఏజెన్సీల వద్ద, పోస్టాఫీసుల వద్ద ప్రజలు క్యూ కడుతున్నారు.

ఇది ఇలా ఉండగా రెండు రోజుల నుంచి ప్రజలు మరింత పరేషాన్ అవుతు జిరాక్స్ సెంటర్, ఫొటో స్టూడియోల వద్ద పోటీ పడుతూ ఫొటోలు జిరాక్స్ లు తీసుకొంటూ ఉండటం చూచి ప్రజా ప్రతినిధులు ఆశ్చర్యపోతున్నారు అసలు ఎందుకు ఇవ్వాలని అర్థం చెప్పలేక పోతున్నారని ఆరోపణలు.

గ్యాస్‌కు రూ.200, పెన్షన్ ఖాతాకు రూ.100

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో అర్హత గల వారు సంబంధిత దరఖాస్తు ఫారాన్ని నింపి, ధ్రువపత్రాల జిరాక్స్‌లు, ఫొటోలు అందజేశారు. ఇంతలో రెండు రోజుల ముందు చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో పలు గ్యాస్ యాజమాన్యాలు ఇంటింటికీ వెళ్లి గ్యాస్ లీకేజ్ ద్వారా జరిగే ప్రమాదాలు, జాగ్రత్తల గురించి కరపత్రం అందజేస్తూ రూ.200 ఇవ్వాలని గ్యాస్ వాడే ప్రతి లబ్ధిదారుల నుంచి వసూలు చేశారు. మరో వైపు పోస్టాఫీసు అధికారులు పెన్షన్ తీసుకోవాలంటే ఖచ్చితంగా రూ.100 జమ, మూడు ఫొటోలు ఇవ్వాలని మైక్‌లో అనౌన్స్ చేయడంతో ఫొటో స్టూడియోలో ప్రజలు కిక్కిరిపోయారు. దీంతో గందరగోళం నెలకొంది. చెప్పిన ధ్రువపత్రాలు ఇవ్వకుంటే సంక్షేమ పథకాలు రావేమో ఆందోళనతో ప్రజలు ఏది అడిగినా కాదనకుండా ఇచ్చేస్తున్నారు.

సమాచారం లేదు

పెన్షన్ విషయంలో డబ్బులు తీసుకోవాలని, ఫొటోలు ఇవ్వాలని మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. పెన్షన్ కోసం అలా తీసుకుంటే అర్హులైన ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. **- ఎంపీడీఓ బషీరోద్దీన్**

రెండు తీసుకోవాలని లేదు

గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించి రెండు వందలు తీసుకోవాల్సిన అనుమతి ఏజెన్సీ వారికి ఉన్నట్లు మాకు తెలియదు. ఇప్పటికి అలాంటిది ప్రభుత్వం నుంచి మా దృష్టికి రాలేదు. సివిల్ సప్లయ్ అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. **- తహసీల్దార్ నారాయణ.**

లబ్ధిదారుల ఇష్టం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉండటంతో మా ఏజెన్సీ కరపత్రాలను ఇచ్చి ఇంటింటికి వెళ్లి గ్యాస్ సిలిండర్ల పరిస్థితిని పరిశీలిస్తున్నాం. డబ్బులిచ్చేది మాత్రం లబ్ధిదారుల ఇష్టం.
- మాధవసాయి ఏజెన్సీ యాజమాన్యం నరసయ్య.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

• సహాయ సంచాలకులు రత్న

నవతెలంగాణ-గాంధారి

రైతులు పంట రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సహాయ సంచాలకులు రత్న అన్నారు. గురువారం మండలంలోని సీతాయిపల్లి, గండివేట్ గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న పంటలను ఎల్లారెడ్డి వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం జొన్నలో కాండం తొలుచు పురుగు, మొక్కజొన్న పంటలో కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఉన్నట్లు గమనించారు. వీటి నివారణ కోసం ఎమ్మామెక్టిన్ బెంజోఏట్ 100గ్రాములు ఎకరానికి లేదా క్లోరాన్ ట్రానిలిప్రోల్ పిచికారీ చేసి మంచి ఫలితాలు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నరేష్, ఏఈఓ షోయబ్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు

వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులకు పోటీలు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నవతెలంగాణ-బిచ్కుంద

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బిచ్కుంద స్వామి వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. "శ్రీరాముని జీవితంలో సామాజిక సామరస్యత" అనే విషయంపై వకృత్వ, వ్యాసరచన పోటీలు, భారతీయ సాంస్కృతిక వైభవం అంశంపై చిత్ర లేఖన పోటీలు నిర్వహించినట్టు కమిటీ అధ్యక్షులు రచ్చ శివకాంత్ తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి ప్రభుత్వం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్, స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి కార్యదర్శి డాక్టర్ నరసింహులు, న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, వాసరే నాగనాథ్, దుబ్బ క్రాంతి కిరణ్ వ్యవహరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

దూపల్లిలో డబుల్ బెడ్ రూమ్‌ల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

• సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి

నవతెలంగాణ-రెంజల్

దూపల్లి గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను కొందరు కబ్జాలకు పాల్పడ్డారని దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, తహసీల్దార్ రామచందర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల తహసీల్దార్‌తో పాటు, బోధన్ ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. అర్హులైన వారికి అధికారులు విచారణ జరిపి వాటిని కేటాయించాలని ఆయన కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ రామచందర్‌కు వివరణ కోరగా.. కబ్జాకు గురైన మాట వాస్తవమేనని, స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ చేత విచారణ జరిపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విచారణలో అర్హులైన ఇండ్లు లేని వారిని గుర్తించి వారికి కేటాయించనున్నట్లు తహసీల్దార్ స్పష్టం చేశారు.

ఘనంగా ఒడ్డెర ఓబన్న జయంతి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో గురువారం ఒడ్డెర ఓబన్న 217 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు ర్యాపని సహెందర్ మాట్లాడుతూ.. ఆనాడు బండలు కొట్టిన చేతులతో బ్రిటిష్ వారిని తరిమికొట్టిన స్వతంత్ర సమర యోధుడని కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఓర్సు నాగయ్య, సలహాదారులు ఓర్సు పోషయ్య, పల్లపు రాజయ్య, డైరెక్టర్లు, ఓర్సు వెంకయ్య, సంపంగి బాలయ్య, సభ్యులు గోగులరవి, ర్యాపని లక్ష్మణ్, హనుమంతు, సంతోష్, అశోక్, రమేష్, రాములు, ఎల్లయ్య, సాయిలు, పల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వారి పేర్ల మీద
ఉపాధి హామీ డబ్బులు చెల్లింపులు

• సామాజిక తనిఖీలో వెల్లడి
• మరెన్నో ఆశ్చర్యకర విషయాలు స్పష్టం

నవతెలంగాణ-పిట్లం


ఉపాధిహామీ పనుల వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

చనిపోయిన వ్యక్తుల పేర్ల మీద ఉపాధి హామీలో డబ్బులు చెల్లింపులు జరిగినట్లు మండల ప్రజా వేదిక సభలో వెల్లడైంది. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కవిత సమక్షంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీ సంబంధించిన ఉపాధి హామీ పనుల వివరాల వెల్లడిలో గ్రామానికి చెందిన కిష్టయ్య, పాపయ్య మృతి చెంది కొన్ని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వారి పేర్ల మీద పనిచేస్తూ, డబ్బులు చెల్లింపులు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. ఆయా గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందాలు వెల్లడించిన వాటిలో కొందరికి పనులకు రాకుండానే డబ్బులు చెల్లింపులు జరిగినట్లు పేర్కొన్నారు. ఏపీవో, ఎంపీఓల సంతకాలు లేకుండానే ఉపాధిహామీ కూలీలకు డబ్బులు చెల్లించినట్లు నివేదించారు. కొందరికి వంద రోజులు పనిపూర్తయినప్పటికీ అదనంగా పనులు చేయించారన్నారు. హరితవనం, అవెన్యూ మొక్కల వివరాలను రిజిస్టర్‌లలో నమోదు చేయలేదన్నారు. వాటి నిర్వహణ సక్రమంగా లేనందున ఎక్కువ మొత్తంలో మొక్కలు ఎండిపోయాయని సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. మాస్టర్‌లలో కూలీల సంతకాలు లేనప్పటికీ బిల్లులు చెల్లించారని పేర్కొన్నారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్ కార్డులను అప్‌డేట్ చేయకపోవడం, అర్హత కలిగిన వారికి జాబ్‌కార్డు అందించలేకపోవడం మూలాన కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజువారి దివస్ నిర్వహించటం లేదని సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా డిఆర్డిఓ పిడి సాయన్న, ఫైనాన్స్ మేనేజర్ రామ్ నారాయణ, డివివో దత్తాత్రి, డిబిటి కల్పన, ఎస్ఆర్పి కొమరయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీఓ బ్రహ్మం, ఏపీవో శివకుమార్, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల బకాయి వేతనాలు చెల్లించాలి

• సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, ఆశాలు

ఆశా వర్కర్లకు బకాయి వేతనాలను కొత్త ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగ ఉన్నందున ఆశా వర్కర్లకు పారితోషికాలు తక్షణమే చెల్లించాలని, గతంలో ఇచ్చినట్లు ప్రతి నెల 2వ తేదీన పారితోషికాలు చెల్లించాలని కోరుతూ గురువారం నిజామాబాద్ డిఎంహెచ్ఓకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. తెలంగాణ జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లకు డిసెంబర్ నెల పారితోషికాలు నేటికీ ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. ప్రజలందరూ నిర్వహించుకునే సంక్రాంతి పెద్ద పండుగ దగ్గరలో ఉందని, ఈ సందర్భంలో డిసెంబర్ నెల పారితోషికాలు నేటికీ రాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని వివరించారు. గత ప్రభుత్వం ఆశావర్కర్లకు ప్రతి నెల 2వ తేదీన పారితోషికాలు చెల్లించిందని తెలిపారు.

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారితోషికాలు చాలా అలస్యంగా చెల్లిస్తుందని వివరించారు. రెండో తేదీన వేయాల్సిన పారితోషికాలు నెల చివర్లో వేస్తున్నారని, కొన్ని సందర్భాల్లో నెల కూడా దాటిపోతున్న పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. దీనివల్ల ఆశా వర్కర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెల మొదటి వారంలో చెల్లించాల్సిన పిల్లల ఫీజులు, ఇంటి అద్దె, కరెంటు బిల్లు, పాల బిల్లు, డ్వాక్రా గ్రూపు డబ్బులు, నిత్యవసరాల సరుకుల కోసం ఆశావర్కర్లు అవసరాలరిత్యా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పండుగల సందర్భంగా అయితే అప్పు చేసి మరీ పండుగలు జరుపుకునే పరిస్థితికి అశావర్కర్లు నెట్టబడుతున్నారని తెలిపారు. పై అంశాలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, జిల్లా నాయకురాలు రాధా తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-లింగంపేట్

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ గురువారం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మీసాల నితీన్ కుమార్ కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గత నెల సెప్టెంబర్ 7 తేదీన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మీసాల నితిన్ కుమార్ కామారెడ్డి పట్టణంలోని సిఎస్ఐ చర్చ్ ముందు బైక్ ఢీకొనడంతో లారీ కిందపడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ బీబీపాటిల్ మృతిచెందిన నితీన్ కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీ బిబి పాటిల్ మాట్లాడుతూ.. మంచి కార్యకర్తను కోల్పోవడం చాలా బాధాకరమైన విషయమని పార్టీ పారంగా, ఆర్థికంగా ఎల్లవేళలా ఏవిషయంలోనైనా తోడు ఉంటామని సహాయ సహకారాలు ఎప్పుడు తనవంతుగా ఉంటాయని అన్నారు. అధైర్య పడవద్దు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు, రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తా, జనార్ధన్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుస్తీమే సవాల్

• పెద్దఎడ్గిలో ఘనంగా కుస్తీ పోటీలు

నవతెలంగాణ-జుక్కల్


తలపడుతున్న మల్లయోధులు

మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో ఎల్ల అమావాస్య పండుగ సందర్భంగా కుస్తీ పోటీలను గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సర్పంచ్ అన్నత్‌వార్ వినోద్ భూమాతా పూజలు నిర్వహించి కుస్తీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గంగునాయక్ బృందం ఘనంగా ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు కుస్తీ పోటీలను తిలకించేందుకు భారీగా తరలిరావడంతో జనసందోహం నెలకొంది. పోటీలను రూ.100 బహుమతితో చిన్న పిల్లల కుస్తీలను ప్రారంభించి పెద్ద కుస్తీ పదకొండు తులాల వెండి కడియం బహుకరించి ముగించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఖండోబా దేవుని పూజలు నిర్వహించిన అనంతరం జాతర చేపట్టారు. మండలంలోనే అతిపెద్ద జాతర ఇక్కడే జరగడంతో సరిహద్దు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఖండేరావ్, పెద్దలు గంగునాయక్, సందీప్ నాయక్, గణు పటేల్, సాయిలు, రఘు, మాణిక్ పటేల్, డోంగ్లి బాబు తదితరులు పాల్గొన్నారు.


కుస్తపోటీలు చూసేందుకు వచ్చిన జనం

హరితహారం లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి

• కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో హరితహారం కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డీఎఫ్ఓ వికాస్ మీనాలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా 2025-2026 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఆయా శాఖల వారీగా హరితహారం కింద నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వ ఆమోదం నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. దీనిని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, నిర్ణీత గడువులోపు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. 2023 - 2024 వార్షిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాల సాధన కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, హరితహారం అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలను గమనించి వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొక్కలకు జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన హరితహారం కార్యక్రమానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యతనిస్తూ లక్ష్యాల సాధనకై పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకుని తదనుగుణంగా అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. నాటాల్సిన మొక్కల లక్ష్యాన్ని, నర్సరీల ద్వారా పంపిణీ చేసే మొక్కలతో కలపకుండా విడివిడిగా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కాగా, పోలీస్‌శాఖకు మొక్కలు పెంచేందుకు వీలుగా సరిపడా స్థలం లేనందున, నగర శివారులో ఐదెకరాల రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాను కేటాయిస్తామని, ఆ స్థలంలో మొక్కలు నాటేందుకు చొరవ చూపాలని డీ.ఎఫ్.ఓ వికాస్ మీనా కోరారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కలెక్టర్ ఎం.మకరందు, అదనపు డీసీపీ ఎస్.జయరాం, ప్రొబేషనరీ ఐ.పీ.ఎస్ బి.చైతన్య, జెడ్పి సీ.ఈ.ఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధ తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి

నవతెలంగాణ-సిరికొండ

గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్‌శాస్త్రి 58వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాని కి పూలమాలవేసి నివాళులర్పించి దేశానికి అందించిన సేవలను స్మరించారు. జాతి సంక్షేమం కోసం నిరంతరం తపిస్తూ, నిరాడంబరంగా జీవిస్తూ ఉన్నతమైన నాయకత్వంతో క్లిష్ట సమయాల్లో తనదైన చతురతతో జాతిని నడిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని కొనియాడారు. భారతదేశ ఆత్మ పల్లెలోనే ఉంటుందని, మన దేశం బాగుండాలి అంటే జవాను బాగుండాలని మనం బాగుండాలి అంటే రైతు చల్లగా ఉండాలని జై జవాన్, జై కిసాన్ అని ఆయనిచ్చిన పిలుపు నేటికి ప్రతిధ్వనిస్తుందని అన్నారు. సుదీర్ఘకాలం ఉద్యమాల్లో రాజకీయ జీవితాలలో ఉన్నా నిరాడంబరమైన రాజకీయ జీవితం గడిపిన శాస్త్రి నేటితరం నాయకులకు స్ఫూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఎంపవో మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని జలాల్ పూర్ గ్రామంలో గురువారం యాసంగి పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ రెడ్డి పరిశీలించారు. యాసంగి పంటలైన మొక్కజొన్న, జొన్న పంటలను పరిశీలించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జొన్నలో పేను బంక నివారణకు రైతులు డైమిథయేటు 400 ఎంఎల్ లేదా తయోమిథాక్జైమ్ 80 గ్రాములు లేదా ఎసిఫేట్ 300 గ్రాములు ఏదేని ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలుపుకొని ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలిపారు. బంక కారు తెగులు : నివారణకు కార్బెండజియం 200 గ్రాములు లేదా మాంకొజెబ్ కార్బెండ జిమ్ 250 గ్రాములు ఏదేని ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలనీ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింభారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీయూసారంగాపూర్ బీఈడీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవ సంబరాలు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

కేంద్ర ప్రభుత్వం, యువజన, క్రీడలు మంత్రిత్వ శాఖ యువజన ఉత్సవాల సందర్భంగా ఈనెల 12 నుండి16 వరకు 27వ జాతీయ యువజన ఉత్సవాలను జరుపాలని నిర్ణయించింది. ఈ యూత్ ఫెస్టివల్‌ని భారత ప్రభుత్వం జాతీయ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తుంది. సాంస్కృతిక, వివిధ పోటీలను నిర్వహిస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయం, సారంగాపూర్ బీఈడీ కళాశాలలో గురువారం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ రవీందర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి వారి కుటుంబంలోని, సమాజంలోని వృద్ధులైన మహిళలని పురుషులని గౌరవించాలని అన్నారు. వృద్ధ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో ఉంచకుండా కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఈడీ, ఎం ఈ డి ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు డాక్టర్ ఆర్. కరుణాకర్, వన్నెల్ దాస్ శ్రీనివాస్, సువర్చల, పోలపల్లి శ్రీకాంత్, లింగమూర్తి, నరేందర్, గణేష్, నవీన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సరిపడా ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కన్వీనర్ అంబిక సత్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సరిపడా ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని టిడిపి నగర్ కన్వీనర్ అంబిక సత్యనారాయణ అన్నారు. గురువారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నగరంలో ఎక్కడ చూసిన ఆధార్ సెంటర్లలో జనాలు రద్దీగా కనబడుతున్నారని అన్నారు. జనాభా ప్రాతిపదికన ఉండవలసిన ఆధార్ సెంటర్లు లేక జనాలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సాధించి సరిపడా ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆధార్ సెంటర్ల నిర్వాహకులకు రావలసిన కమిషన్లు చాలా తక్కువ మొత్తంలో ఉన్నాయని కొన్ని సెంటర్లు మూసివేశారని, వారికి కనీస గౌరవ వేతనమిస్తూ, కమిషన్లు పెంచాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేంజర్ల సురేష్, అర్బన్ కో కన్వీనర్ కోయెడి నర్సింలు గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఎండీ రఫీక్ ఖాన్, అనుబంధ సంఘం కన్వీనర్ లు గంగొనే రాజేశ్వర్,రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ధైర్య సాహసాలు అనన్యసామాన్యం

- జయంతి వేడుకల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కీర్తించారు. ఆ మహనీయుని స్మరిస్తూ, అధికారికంగా జయంతిని నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. వడ్డె ఓబన్న 208 వ జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇతర అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న ఆనాడు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి జరిపిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. వడ్డె ఓబన్న ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, బీ.సీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, ఆయా సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, పి.వెంకటేష్, నగేష్, శంకర్, బుస్స ఆంజనేయులు, ఎం.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న స్ఫూర్తితో వడ్డెర యువత సామాజిక న్యాయ సాధనకు ఉద్యమించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలను జరపడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వర్గానికి బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ వడ్డెర జెఏసి కన్వీనర్ దండి ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వడ్డె ఓబన్న 217వ జయంతి ఉత్సవాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని టీఎన్జీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ.. మహాత్మా జోతిబా పూలే చెప్పినట్లు విద్య లేకపోతే విజ్ఞానం రాదని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు అధికారంలోకి రాని జాతి అంతరించిపోతుందని చెప్పిన విధంగా నేడు భారతదేశంలో సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధి దక్కని జాతుల్లో వడ్డెర జాతి ఒకటని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు డి. నాగేష్, జిల్లా కార్యదర్శి బత్తుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎత్తరి రాములు, వడ్డెర జెఏసి జిల్లా నాయకులు వేముల రాందాస్, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇ.సాయిలు, జిల్లా నాయకులు పి.వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణిలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని, అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రపంచ దేశాలకు భారతదేశ గొప్పతనాన్ని చాటిచెప్పిన గొప్ప మహనీయుడని గుర్తు చేశారు. భారతదేశ సంస్కృతి, సాంప్రదాయం, హిందూ సనాత ధర్మాన్ని చాటిచెప్పిన ఘనత స్వామి వివేకానందదే అని అన్నారు. దేశానికి యువతే పట్టుకొమ్మలని వారు సంకల్ప బలంతో ఏదైనా సాధించగలరని స్వామి వివేకానంద యువతకు సందేశం ఇచ్చారని గుర్తు చేశారు. అంతకుముందు పాఠశాలలో 6తరగతి చదువుతున్న విద్యార్థి వర్షిత్ స్వామి వివేకానంద వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. పాఠశాలలోని ఆరవ తరగతి విద్యార్థినిలు శామిలి తెలుగు భాషలో, సానిక హిందీ భాషలో, ఐదవ తరగతి విద్యార్థి హిమానిస్ ఆంగ్ల భాషలో స్వామి వివేకనంద జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.ఆరవ తరగతి విద్యార్థినులు శామిలి, రుచితలు దేశభక్తి గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిలుక గంగా ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (టిఎస్‌యూటీఎఫ్) కాలమానిని మండల విద్యా వనరుల కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో యూటీఎఫ్ నిరంతరం పాటుపడుతుందని అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. హక్కులు, బాధ్యతలు రెండు ఉద్యమ నేత్రాలుగా పని చేయడం గొప్ప పోరాట పటిమకు నిదర్శనమని ఆయన అన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను సత్వమే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కారానికి చొరవ చూపి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. బదిలీలు, పదోన్నతుల తర్వాతనే మెగా డియస్సీకి ఆస్కారం ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులకు వీలయినంత తొందరలో అంతర్గత టెట్ నిర్వహించి పదోన్నతులు పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో సిఆర్పీలు బాలరాజు, నరేందర్, సంతోష్ , ఐఆర్పీ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో మ్యాథ్స్ ఫెస్టు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పరిధిలోని మామిడిపల్లిలో నలంద హైస్కూల్ యందు గురువారం మ్యాథ్స్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఉత్సాహవంతంగా విద్యార్థులు తమ ప్రతిభను నమూనాల రూపంలో మాథ్స్ ట్రిక్స్‌ను ఉపయోగించి కఠినమైన ప్రశ్నలకు కూడా సులువైన రీతిలో సమాధానాలు తెలిజేస్తూ తల్లిదండ్రులను ఆశ్చర్య చకితులను చేశారు. పిల్లల నమూనాలను, ట్రిక్స్‌ను, గణిత శాస్త్రంలో ఉన్న మెళకువలకు సంబంధించిన విషయాలలో విద్యార్థులకు గణిత శాస్త్ర ఉపాధ్యాయులు హనుమాండ్లు, ప్రవీణ్, అక్షయ్, దివ్యభారతి, కీర్తి, అరుంధతి అవగాహన కల్పించడంలో సహాయపడ్డారు. ఉపాధ్యాయులను నలంద యాజమాన్యం అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ సాగర్ మాట్లాడుతూ గణిత శాస్త్రం జీవితంలో ప్రతి ఒక్కరు నేర్చుకోవాల్సిన సబ్జెక్టు అని, ఉద్యోగ సాధనలో మ్యాథ్స్ కూడా ముఖ్యపాత్ర వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి మ్యాథ్స్ పట్ల ఆసక్తిని కనబరిచేలా చదవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ ఎగ్జిబిషన్లో భాగంగ అద్భుతమైన ప్రతిభను చూపిన విద్యార్థులను అభినందించారు ఇలాగే భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చలాన్ల గడువు తేదీ పొడిగింపు



నవతెలంగాణ-ముప్కాల్

వాహనాల జరిమానాల చెల్లింపు గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 వరకు పొడగించిందని ఎస్ఐ భాస్కరా చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వాహనదారులు తమ వాహనాలపై ఉన్న జరిమానాలను వెంటనే చెల్లించాలని సూచించారు. చలాన్లు ఉన్న వాహనదారులు తప్పకుండా రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మంత్రిగా ప్రశాంత్‌రెడ్డి హయాంలో..

ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారు..

- తప్పుడు పత్రాలతో మోసం చేస్తున్నారు
- రాష్ట్రప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి
- బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు



మోర్తాడ్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



ముప్కాల్‌లో...

నవతెలంగాణ-విలేకరులు

మోర్తాడ్: టిఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు ఇచ్చిన తప్పుడు పత్రాలతో మోసం చేసింది కాకుండా వాటిని అమలు చేయాలంటూ ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు ఐదు లక్షల రూపాయల ఇస్తామంటున్నప్పటికీ వాటిని కాదంటూ టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మూడు లక్షల రూపాయల కావాలంటూ ధర్నా చేయడం సరికాదని అన్నారు. లబ్ధిదారులకు ఇచ్చిన పత్రాలను ఎలాంటి సంతకాలు లేకుండా అధికారులకు తెలియకుండానే నాయకులు పంపిణీ చేసిన ఘనత వారికి దక్కిందని అన్నారు. అధికారికంగా ఇవ్వాల్సిన మంత్రి తప్పుడు ప్రింటింగ్ పత్రాలు ఇచ్చి లబ్ధిదారులను మోసం చేశాడని, వాటిపై మంత్రి సంతకం గాని అధికారుల సంతకాలు గాని ఎందుకు లేవని ప్రశ్నించారు. ఓట్ల కోసం తప్పుడు పత్రాలను ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూసారే తప్ప లబ్ధిదారులకు న్యాయం చేయటంలో మోసపోయారని అన్నారు. మూడు లక్షల రూపాయలను రద్దు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులందరికీ ఐదు లక్షల రూపాయలను ఇస్తుందని ఐదు లక్షల కాకుండా మూడు లక్షల కావాలంటూ ధర్నాలు నిర్వహించడం టిఆర్ఎస్ ప్రభుత్వ నాయకులకే చెల్లిందని అన్నారు. నిరసన తెలుపడంలో లబ్ధిదారుల కంటే టిఆర్ఎస్ నాయకులే అధికంగా ఉన్నారని, ఇది నాయకుల నిరసనని తప్ప లబ్ధిదారులకు నిరసన కాదని అన్నారు. మూడు లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీలతోపాటు, పలు ప్రొసీడింగులు కేవలం డూప్లికేట్ అని అన్నారు. వీటన్నింటిపై అధికార పార్టీ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యే వీటి మంజూరుకు కృషి చేయాలని, అవి అమలు అయ్యే బాధ్యత ఎమ్మెల్యేదని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములు, సంతోష్, గోపి, అశోక్, ప్రవీణ్, గంగాధర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇచ్చారో గుర్తుచేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవకముందే కాంగ్రెస్ నాయకుల మీద, ప్రవేశ పెట్టిన పథకాల మీద అనుచరులతో విమర్శలు చేయించడం సిగ్గుచేటన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి నాయకులు ప్రశాంత్ రెడ్డి వారికి లొత్తులుగా వ్యవహరించిన కొందరు సర్పంచులు గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు రూ.5 లక్షల ఇస్తామని చెప్పి మాట మార్చి రూ.3 లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇస్తామని చెప్పిన ప్రశాంత్ రెడ్డి మాటలు ఎక్కడ నిజమో నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఆదరాబాదరగా ఎలాంటి గ్రామ సభలు పెట్టకుండా లబ్ధిదారులను ఎంపిక చేయకుండ, తన అనుచరులతో బంధుమిత్రులకు, పార్టీ నాయకులను సెలెక్షన్ చేసుకోని, ఎలక్షన్ కోడ్ ఉండంగా పాత తేదీల్లో ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారని విమర్శించారు. అందులో కొన్ని డమ్మీ ప్రొసీడింగ్‌లు, గ్రామాల్లో కుల సంఘాలకు ఎలక్షన్ కోడ్ ఉండంగానే ప్రొసీడింగ్‌లు ఇచ్చి కుల సంఘ భవనాలు నిర్మించుకోవచ్చుఅంటూ మభ్యపెట్టారన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ లబ్ధిపొందడంతో కుల సంఘాల సభ్యులు ప్రస్తుతం ఎక్కడ నిలదీస్తారోనాని బీఆర్ఎస్ నాయకులకు, సర్పంచులకు భయం మొదలయ్యిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిన్నారెడ్డి, చందా రవి, బద్దం సాగర్ రెడ్డి, రాజ్ కుమార్, ప్రవీణ్, సాజిత్, విజయ్ రెడ్డి, లోక్ సుభాష్, మల్లారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

భీంగల్: టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో ప్రజా సమస్యలను పరిష్కరించకపోగా నేడు రాజకీయ లబ్ది పొందేందుకు ధర్నాల పేరుతో కపట నాటకాలు ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జె జె నరసయ్య అన్నారు. పట్టణ కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలకాలంలో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందకుండా నాయకులు, కార్యకర్తలు నొక్కేశారని, ఇది గమనించిన ప్రజలు గుణపాఠం నేర్పారని అన్నారు. ఇది జీర్ణించుకోలేని టిఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నాలు నిర్వహించి రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో గృహలక్ష్మి పేరుతో నామమాత్రపు ప్రొసీడింగ్ కాపీలను ఇచ్చి చేతులు దులుపుకున్నారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఇయ్యదని చెప్పి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి లబ్ధిదారునికి ఆరు గ్యారెంటీ సంక్షేమ పలాలు అందుతాయని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు స్వామి ,గోపాల్ నాయక్, కరాడి రాజు, సుంకరి సురేష్, అనంతరావు, శివరాం నాయక్ , నాగేంద్ర తో పాటు మండల నాయకులు పాల్గొన్నారు

ఏర్గట్ల: రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. పార్టీ మండలాధ్యక్షులు సోమదేవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆదేం గంగాప్రసాద్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీల విషయంలో లబ్ధిదారులను తప్పుదోవ పట్టించిందని, వారితో ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రాలు ఇప్పించి అబద్ధపు ప్రచారాలకు తెరలేపారని అన్నారు. గురువారం అదే లబ్ధిదారుల వద్దకు వెళ్ళి గత ప్రభుత్వం మోసాన్ని వివరించామని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలపై కలెక్టర్ సంతకం కానీ, ఎమ్మార్వో సంతకం కానీ లేవని, అవి ఏ విధంగా చెల్లుబాటు అవుతాయని ఎద్దేవా చేశారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వాన్నిసీఎం రేవంత్ రెడ్డిని బద్నాం చేయడానికేనని అన్నారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ రవిరెడ్డి,ముస్కు మోహన్ రెడ్డి, జింక అనిల్, దేవన్న, బెజ్జారం భాను, మునీర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తహసీల్దార్ కార్యాలయాల ముందు బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2014 ఎన్నికల సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు రూ. ఐదు లక్షల చొప్పున ఇస్తామని నమ్మించి బీఆర్ఎస్ నాయకులు రెండు సార్లు అధికారంలోకి వచ్చిన నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి స్వయంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పది సంవత్సరాలు అధికారంలో ఉండి నిరుపేదలకు చేసిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలో కేవలం నాలుగైదు వందల ఇండ్లు నిర్మించి అందరినీ మోసం చేసిందే కాకుండా గృహలక్ష్మి లబ్ధిదారులతో ధర్నాలు చేయించడం సిగ్గుచేటు అన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు ఇచ్చిన ప్రొసీడింగులు ఎన్నికల నియామావళి అమలులో ఉండగా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిజంగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి గాని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికిగాని చిత్తశుద్ధి ఉంటే గత పది సంవత్సరాల నుండి ఎందుకు ఇవ్వలేదో లబ్దిదారులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులే అయినా ఆరు గ్యారంటీల అమలుకు ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అందులో నుండి నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందని తెలిపారు. మిగతా గ్యారంటీలను కూడా తొందరలోనే నెరవేర్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, పడిగెల ప్రవీణ్, పాలెపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, వేములవాడ జగదీష్, ఉట్నూర్ ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, బుచ్చి మల్లయ్య, నల్ల సాయి, జైడి బాలకృష్ణ, పడాల గంగాధర్, ఆల్గోట్ రంజిత్, కౌడ శైలేందర్, పల్లపు రవి, అజారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన స.హా.చట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు



నవతెలంగాణ-కామారెడ్డి
ఇటీవల కామారెడ్డి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సింధు శర్మను స.హా.చట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స.హా.చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ.సలీం, రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజన్న, జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జంగమ అర్చకుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న జంగమ అర్చకులు

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని ఉత్నూర్ గ్రామంలో జంగమ అర్చక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జంగమ అర్చకుల సమస్యలు, అభివృద్ధి, భవిష్యత్‌పై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షులు జంగం అవినాష్ రామారెడ్డి, ఉపాధ్యక్షులు మఠం శివప్రసాద్ చిట్యాల, కోశాధికారి జంగంప్రసాద్ సదాశివనగర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామివివేకానంద జయంతి

• వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న యువకులు



నవతెలంగాణ-ఎడపల్లి
ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో భాగంగా ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో యువకులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా స్వామివివేకానంద విగ్రహాలను శుభ్రం చేస్తున్నారు.

మండలంలోని ఎడపల్లి, మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి, తానాకలాన్, మంగళ్‌పహాడ్‌లో సర్పంచ్ బట్టు హనుమాన్లు, గ్రామపెద్దలు, పంచాయతీ కోఆప్షన్ సభ్యులు, రజక సంఘం ఎడపల్లి మండల అధ్యక్షులు దేగాం ముత్యంతోపాటు గ్రామ యువకులు ఐక్యతతో స్వామి వివేకానంద విగ్రహానికి రంగులు వేయించారు. ప్రతి సంవత్సరం ఎడపల్లి రజక సంఘం మండల అధ్యక్షులు, మంగళ్‌పహాడ్ గ్రామపంచాయతీ కో ఆప్షన్ సభ్యులు దేగాం ముత్యం స్వామి వివేకానందకు తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారి




నవతెలంగాణ-కామారెడ్డి
జిల్లాకు నూతనంగా వచ్చిన ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారి కాజల్ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 75ఆర్ఆర్ 2022 బ్యాచ్‌కు చెందిన కాజల్ సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ఆమె ఆరుమాసాల పాటు ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కామారెడ్డిలో విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో జిల్లా పరిస్థితులపై పలు అంశాలు చర్చించారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన తహసీల్దార్



నవతెలంగాణ-నిజాంసాగర్
మండలంలోని మల్లూరుతండా, జక్కాపూర్, వడ్డేపల్లి గ్రామాలలో తహసీల్దార్ బిక్షపతి చౌకదారుల దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవకతవకలు లేకుండా బియ్యం పంపిణీ చేయాలని ఆయన సుచించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు


వేషాధారణలో విద్యార్థినిలు

నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా వేషాధారణ పలువురిని ఆకర్షించింది. పల్లెటూరు వాతావరణం తలపించేవిధంగా విద్యార్థుల వేషాధారణ పండుగ వాతావరణం తెలియజేస్తుంది. పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం మాట్లాడుతూ.. పాఠశాలలో ఈ విధంగా విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహిస్తే దేశసంస్కృతి, సాంప్రదాయాలు విద్యార్థులకు అలవడుతాయని ఆయన పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భోగిమంటలు, హరిదాసు, పిండి వంటలు, తదితర వేషాధారణలో విద్యార్థినీ విద్యార్థులు పలువురిని ఆకర్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నప్ప, అరుణా, జ్యోతి, సురేష్, శ్రీనివాస్, దాముల, సంతోష్, జైనుల్, సంతోష్, గీత, లావణ్య, ఆంజనేయులు, భాను, శాంతి, మయూరి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న

• కలెక్టర్ జితేష్ వి పాటిల్


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి
బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనియాడారు. ఓబన్న 208వ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ ఆవరణలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఒడ్డె ఓబన్న సైనాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేసిన ధీరుడని అన్నారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో ఎన్నో వర్గాల పోరాటం, త్యాగాల ఫలితంగా మనమీనాడు స్వేచ్ఛ వాయువులు పీల్చగలుగుతున్నామని తెలిపారు. ఆ మహనీయుల దేశభక్తి, పోరాట పటిమ ముందుతరాల వారికి తెలియాలనే ఉద్దేశ్యంతో మహనీయుల జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని వివరించారు. ఆ మహనీయుల ఆశలు, ఆశయాలకనుగుణంగా అన్ని వర్గాల ప్రజలు ముందుకుసాగుతూ దేశ, రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఒడ్డెర సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఒడ్డెర సంక్షేమానికి పాటుపడాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించాలని, ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బి.సి. అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి సూర్యరాజం, ప్రతినిధులు ఒడ్డె శ్రీనివాస్, మధుసూదన్, కొమురయ్య, రమేష్, బాలయ్య బి.సి.సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేవునిపల్లి మల్లన్నను దర్శించుకున్న జహీరాబాద్ ఎంపీ


మల్లన్నను దర్శించుకున్న ఎంపీ బి.బి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి
దేవునిపల్లి మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బి.బి.పాటిల్ గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ నిర్వాహకులు, విడిసి ప్రతినిధులు
మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవ జ్ఞాపిక, శాలువాతో ఎంపిని సన్మానించారు. అనంతరం పేద, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు గాను విడిసి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విడిసి ప్రతినిధులు కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరగా.. తప్పకుండా పూర్తిగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు మర్కొంటి స్వామి, ఉపాధ్యక్షులు భోజన్నగారి రాజు పాటిల్, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్‌కుమార్, కోశాధికారి గూడేళ్ళి గంగారాం, స్థానిక కౌన్సిలర్ ఉరుదొండ వనిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల రవీందర్, విడిసి సభ్యులు వంగ రాహుల్ కుమార్, నిట్టూ ప్రభాకర్, నాగల్ల స్వామి, శ్రీకాంత్‌చారి, ఆరెటీ శ్రీను, బాలయ్య, గౌరవ సలహదారులు లద్దురి లక్ష్మిపతి యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ


నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సిరికొండ
మండల కేంద్రంలోని ఎమ్ఆర్ఓ రవీందర్ రావు, ఎంపీడీఓ లక్ష్మి ప్రసాద్, ఎస్ఐ రమేష్ గురువారం నవతెలంగాణ 2024 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శూన్యం అమావాస్య


పిట్లం : పంటపొలంలో భోజనం చేస్తున్న రైతులు

నవతెలంగాణ-పిట్లం/జుక్కల్
మండలంలోని ధర్మారం, కారేగావ్, గోద్మేగావ్, అల్లాపూర్, పారేడ్‌పల్లి గ్రామాలలో శూన్యం అమావాస్యను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న శూన్యం పండగను రైతులు తమ పంట పొలాలు దర్శించుకొని తాత్కాలిక లక్ష్మీదేవితో పాటు వనదేవతలను ఏర్పరచుకొని వాటికి నియమనిష్ఠలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని పూజలు నిర్వహించారు. అనంతరం బంధుమిత్రుల మధ్య పిండి వంటలతో వనభోజనాలు నిర్వహించారు.

జుక్కల్: మండలంలోని గ్రామాలలో ఎల్ల అమవాస్య పండుగను రైతులు ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో రైతులు ప్రత్యేకంగా పంటపొలాల్లో ఈ పండుగను నిర్వహిస్తారు. ఉదయం పంటపొలాల్లో తెల్లజొన్న సొప్ప బెండులతో గుడిసెను తయారుచేసి చుట్టూరా కొత్త చీర, ధోతి, గొంగడి కప్పి లోపల మట్టితో ఇంటిలో నిత్యం ఉపయోగించే సామగ్రిని మట్టితో తయారు చేశారు. ఇంట్లో దేవతలను, పాడి పశువులను చేసి పండ్లు, చెరుకు గడ, పండ్లు, ఇంటివద్ద రుచికరమైన పల్లి రొట్టెలు, జొన్న అన్నం, పాయసం, జొన్న అంబలి ఇతర వంటకాలతో అంబలి కడవతో నింపుకుని పూజలు నైవేద్యం పెట్టి నిర్వహించారు. బంధు మిత్రులను ఆహ్వానించి పిండి వంటలతో, భోజనాలతో విందును ఆరగించారు. పంటలు, పాడి పశువులు సంపద పెరగాలని, సుఖసంతోషాలతో ఉండాలని ధాన్యలక్ష్మికి మొక్కులు తీర్చుతారు.

ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేయాలి

• ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి
ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి అన్నారు. గాంధారి మండల కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడుతూ.. బీజేపీ ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసే జహీరాబాద్ పార్లమెంట్ స్థానం గెలుస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార, వరంగల్ ఇంచార్జి మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవిగౌడ్, సుభాష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, గాంధారి మండలాధ్యక్షుడు సాయిబాబా, అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత

• డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి


వికలాంగులకు సైకిల్ అందజేత

నవతెలంగాణ-వర్ని
ఉమ్మడి జిల్లాల డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దివ్యాంగులకు తన సొంత ఖర్చులతో ట్రై సైకిళ్లను అందజేశారు. దివ్యాంగులైన బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సయ్యద్ షబ్బీర్‌కు, దేశాయిపేట్ గ్రామానికి చెందిన రాజుకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి చిన్నచూపు చూసినా పెద్ద మనస్సుతో తాను మీకు అండగా ఉంటానని అన్నారు. స్వంత అవసరాల కోసం ఎక్కడైనా తిరగాల్సి వస్తే ప్రయాణ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు, జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దృష్టికి తేవడంతో మానవత్వంతో స్పందించి ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ళను కొనిచ్చారు. తమకు బయట ప్రయాణానికి వెళ్ళాలంటే ఇబ్బందులు పడుతున్న తమకు మానవత్వంతో స్పందించి స్వంత ఖర్చులతో ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ ను అందించిన పోచారం భాస్కర్‌రెడ్డికి సయ్యద్ షబ్బీర్, రాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి గీతా జ్ఞాన యజ్ఞం

• ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎం.పి

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని లింగంపల్లి గ్రామంలో కృష్ణ మందిరం వద్ద 9, 10, 11 తేదీల నుంచి విశ్వశాంతి గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహించారు. ఇది 27వ వార్షికోత్సవమని తెలిపారు. మహచింతన్ పరివార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి గురువారం జహీరాబాద్ ఎం.పి బీబీ పాటిల్ హజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో నిర్వహించిన యజ్ఞానికి మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవడం ఎంతో సంతోషం కలిగిందని అన్నారు. బబుల్ కర్ బాబాను బీబీపాటిల్ శాలువాతో సన్మాంచి పుష్పగుచ్చాన్ని అందజేశారు. భక్తులకు మూడు రోజులు భోజనాలను, అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో మహంత్ మచాలే బాబా, మచాలే పరివార్ సభ్యులు, భక్తులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నిజాంసాగర్ నీటి విడుదల

నవతెలంగాణ-నిజాంసాగర్
నిజాంసాగర్ జలాశయం నుంచి ప్రధాన కాలువ లోకి గురువారం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నీటిని అనవసరంగా వృధా చేయొద్దని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా.. దానిలో 1401.97 అడుగుల నీరు ఉందని ఆయన వివరించారు.

బోర్గం గ్రామంలో శావులం సాయిలు 28వ వర్ధంతి


చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్
పేద ప్రజలకు అండగా నిలిచి అనేక పోరాటాలు చేసి ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇప్పించిన ఘనత శావులం సాయిలుకే దక్కుతుందని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం. నరేందర్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని బోర్గం గ్రామంలో సాయిలు 28వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన చావులం సాయిలు అనేక భూ పోరాటాలు చేసి భూములు లేని నిరుపేదలకు భూములు ఇప్పించాడని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇంటి స్థలాలు ఇప్పించినట్టు తెలిపారు. ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాల్లో అనేక పోరాటాలు చేసిన ఆదర్శనీయుడని, ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని వారన్నారు. సమాజంలో ఆయన ఎదుగుదలను ఓర్వలేకనే తనను హత్య చేశారని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రాజేశ్వర్, జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, వడ్డెన్న, పెద్దులు, గోపాల్, సిద్ధపోశెట్టి, లక్ష్మణ్, సంతోష్, మన్నె పోశెట్టి, ఆజన్న, తరుణ్, మైసన్న తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని జ్ఞాపకార్థంగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన మీసాల నితీన్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి మిత్రబృందం గురువారం స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా మిత్రుడి జ్ఞాపకార్థంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ.. మీసాల నితీన్ చనిపోయినప్పటికీ వారి మిత్రులందరూ కలిసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, మిత్రుడు దూరమైన పదిమంది ప్రాణాలను కాపాడాలని సంకల్పంతో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారని అన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలకు తెలంగాణ టూరిజం పూర్వ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ తరపున అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు జమీల్, కిరణ్, మీనాక్షర్ రాజు, గంగా ప్రసాద్, ఆకుల భరత్, శివకుమార్, శ్రీధర్, భూమయ్య బ్లడ్‌బ్యాంక్ డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలంపాట


మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్
అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకోగా.. ఆ ఇసుక డంపులను గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో పాల్గొన్న ముగ్గురి నుంచి రూ.5వేల డిపాజిట్‌ను తీసుకొని వేలంపాట నిర్వహించగా.. నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు రూ.10,500కు వేలం పాట పాడి దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో స్థానికులు అన్సార్, ఆర్.జనార్ధన్‌రెడ్డి, గంగాగౌడ్, సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్
మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. సంక్రాంతి సంబరాలను పాఠశాలలో సైతం విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. వేడుకల్లో భాగంగా పాలు పొంగిచడం, పచ్చని తోరణాలను అలంకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్, చిత్ర, లింగమయ్య, నీరజ, అనిత, అరవింద్, దశరథ్, రమేష్, జీజీయ, వాసవి, విద్య రమణ, కృష్ణప్రియ, ప్రవీన్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు గుర్తింపు


బాలికను స్కూల్‌లో చేర్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజాంసాగర్
మండలంలోని మహ్మద్‌నగర్‌లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నర్సింలు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూధన్ సమక్షంలో బడి బయట పిల్లల సర్వేను బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా నర్వ హ్యాబిటేషన్‌లో ఈశ్వర్ అనే బాలుడిని గుర్తించారు. అనంతరం మహమ్మద్‌నగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు. అలాగే గోర్గాళ్ హాబిటేషన్లో బాలికను గుర్తించినట్టు సిఆర్‌పి వరలక్ష్మి తెలిపారు. నిజాంసాగర్ పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించినట్టు ఆమె పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు క్రమం తప్పకుండా స్కూలుకు వెళ్లేలా తగిన కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే విద్యార్థి బడికి క్రమం తప్పకుండా వచ్చేందుకు తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్పి శంకర్‌గౌడ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

స్వామి వివేకానంద జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఏర్గట్ల


వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం

స్వామి వివేకానంద 152వ జయంతిని పురస్కరించుకుని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి స్వామి వివేకానందని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ, కృష్ణప్రసాద్, సుధాకర్, రాములు, గంగాధర్, రవి, సుజాత, స్వప్న, విజయ పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేస్తే సమాచారం ఇవ్వండి

- షీటీం కానిస్టేబుళ్లు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్ల, విగ్నేష్, సుమతి అన్నారు. పట్టణంలోని సాయి వొకేషనల్ కాలేజ్ గురువారం సైబర్ క్రైమ్ గురించి విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంజిత్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఆర్ఎస్ఐ దేవిసింగ్ సస్పెండ్

- ఉత్తర్వులు జారీచేసిన సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కమిషనరేట్ ఏఆర్ ఎస్సై దేవీసింగ్ సస్పెండ్ అయ్యారు. విధులు నుంచి తొలగిస్తూ సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగోటౌన్ పరిధిలో జరిగిన ఓ వివాదానికి సంబంధించి దేవీసింగ్ ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఎవరు విధుల్లో నిర్లక్ష్యం చేసినా, ఏ చిన్న ఆరోపణ వచ్చినా సీపీ కల్మేశ్వర్ సత్వరమే చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు పదుల సంఖ్యలో అధికారులు, సిబ్బందికి చార్జిమెమోలు ఇచ్చారు.

ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని దుబ్బ భూ పోరాటం వద్ద ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు ముగ్గులు వేయడమే కాకుండా సమాజంలో మహిళల పాత్ర, ప్రభుత్వాలు, చట్టాలు ఎలా ఉండాలో కొటేషన్లతో వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, జిల్లా అధ్యక్షురాలు అనిత పోటీల్లో పాల్గొన్న మహిళలని అభినందిస్తూ బహుమతులు అందజేశారు.

సాయి భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-ముప్కాల్

మండలకేంద్రంలో వారం రోజులుగా కొనసాగిన 'సాయి పారాయణం' ముగింపు సందర్భంగా భక్తులకు గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు జోగు సంగీత-నర్సయ్య దంపతులు అన్నదాన సత్రంకు సహకారాన్ని అందించారని సాయి సేవా సమితి సభ్యులు కొమ్ముల సాయిరెడ్డి, పృథ్వీ వల్లభ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమం విజయవంతం చేసినందుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయి సేవా సమితి సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు లబ్ధిదారుల ఫ్రీజింగ్ ఎత్తివేయాలి

- దళిత సంఘాల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దళిత బంధు పథకం లబ్ధిదారుల ఎంపిక జరిగి ఖాతాలలో డబ్బులు పడినప్పటికీ మరి కొంతమంది అర్హులుగా ఉన్నప్పటికీ దళిత బంధు పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకి వినతి పత్రం అందజేవారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల ఆర్థిక అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా దళితులను సమిధలుగా మార్చవద్దని అన్నారు. దళిత బంధు పథకాన్ని కొనసాగించి, ఇప్పటికే ఎంపిక చేసిన అర్హులైన వారందరికీ నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల ఆగ్రహానికి గురికాగా తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు దండు చంద్రశేఖర్, మల్యాల గోవర్ధన్, భూమయ్య, మోహన్, తదితరులు మాట్లాడి పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. బాల్కొండ మండలం నాగపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు.11గంటలకు వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో రూ. 20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్ గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, మధ్యాహ్నం 4గంటలకు తడపాకల్ గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయా మండలాల ప్రజాప్రతినిధులు కోరారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు గురువారం సిరికొండ సర్పంచ్, ఉప సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి మాట్లాడుతూ 17 ఏళ్ళ వయసులోనే శివాజీ మొట్ట మొదటి యుద్ధం చేసి బీజపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్ణ కోటను సొంతం చేసుకున్నాడని అన్నారు. యువత ఆయనను స్ఫూర్తి గా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాదాల రామకృష్ణ, విడిసి చైర్మన్ సంతోష్, బాబురావు, మేదర్ గోపి, మహేష్, స్వామి, గంగాధర్, మారుతి, యువకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉప్లూర్ విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థినులు దివ్య సుమలత రాష్ట్ర స్థాయి జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ పోటీకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజన్న గురువారం తెలిపారు. పోటీకు ఎంపికైన విద్యార్థినిలు ఈ నెల 15,16,17తేదీల్లో ఆసిఫాబాద్‌లో జరిగే హాండ్ బాల్ ట్రోఫీలో పాల్గొంటారని పీఈటీ మాధురి అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ పోటీకు ఎంపికైన విద్యార్థినిలు దివ్య, సుమలత, పీఈటీ మాధురిని అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

యువతే దేశానికి భవిత

- లక్ష్య సాధనతో విజయాలు సొంతం
- ప్రయత్నిస్తే సాధించలేని ఏదీ లేదు
- నేడు జాతీయ యువజన దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

దేశానికి అసలైన శక్తి యువత. అలాంటి యువత దారి తప్పితే దేశ భవిష్యత్తుకే ప్రమాదం. యువతకు దిశా నిర్దేశం చేసిన స్వామి వివేకానందుని జయంతి నేడు. ఈ సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తారు. యువత లక్ష్య సాధన వైపు కదిలితే అనుకున్న విజయాలు సొంతం చేసుకోవచ్చని కార్యాచరణ అమలు చేస్తే సుకున్నది సాధించవచ్చు. ఈ సందర్భంగా నవ తెలంగాణ కథనం..

బంగారు భవిష్యత్తును బలి చేసుకోవద్దు..

నేడు సమాజంలో చోటు చేసుకుంటున్న విపరీత ధోరణలు, చెడు పోకడలు, అరాచకాలు, అసంఘిక కార్యకలాపాలతో యువత దారి తప్పుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. ఎంచుకున్న మార్గంలో నడవకుండా పెడదోవ పడుతున్న పరిస్థితి నెలకొందని అభిప్రాయ పడుతున్నారు. తద్వారా వారి భవిష్యత్తు నాశనమై సమాజంలో గౌరవం కోల్పోతున్నారు. కన్నవారికి కూడా వేదన మిగులుస్తున్నారు. యువత దారి తప్పితే దేశ భవిష్యత్తుకే ప్రమాదమని వారంటున్నారు. జీవితంలో అల్లరి ఉండాలి కానీ జీవితమే అల్లరి పాలు కాకుండా చూసుకోవాలి. శృతిమించితే తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు తప్పవు. మద్యం, ధూమపానం, గుట్కా ,పేకాట వంటి ఆ వ్యసనాల బారినపడి ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎంజాయ్ పేరుతో చెడు అలవాట్లకు లోనై వాటికి బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును బలి చేసుకోవద్దు. వాటికి దూరంగా ఉండడం మంచిది. సమాజం అందరినీ పరిశీలిస్తుంది అందుకే సమాజంలో విలువలు పోగొట్టుకొని బతకడం కష్టం. విలువలను పాటించటం, పెద్దలను గౌరవించటం వారు చెప్పిన విషయాలను పాటించటం ద్వారా మంచి పేరును తెచ్చుకోవచ్చు..

లక్ష్య సాధన పైనే ధ్యాస ఉంచాలి..



చదువుకుంటున్న యువత అయినా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత అయినా తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించుకోవడం పైనే ధ్యాస ఉంచగలిగితే సులువుగా గమ్యం చేరుకోగలుగుతారు. విశాల దృక్పథంతో ఆలోచనలు చేయాలి. సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం సమాజం గురించి అవగాహన పెంచుకోవడం అవసరం. పేద, బడుగు బలహీన వర్గాల సమస్యల్ని ప్రభుత్వం నాయకుల దృష్టికి తీసుకెళ్లడం, లక్ష్యాన్ని సాధించుకునే క్రమంలో కష్టాలు ఎన్ని వచ్చానా బెదరకుండా ముందుకు సాగాలి. నిర్మాణాత్మకమైన ఆలోచనలతో ఆత్మవిశ్వాసం ఆత్మస్థైర్యంతో లక్ష్యాన్ని సాధించుకునే ప్రయత్నం చేస్తే విజయం తప్పకుండా మీ బానిస అవుతుంది.., విద్య, సహనం, నిర్భయత కలిగిన యువతను స్వామీజీ కలలు కన్నారు.

బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలి..



నేటి యువత , సవాళ్లను ఎదుర్కొని నిర్భయంగా ఉండాలి. మార్గదర్శక శక్తిగా విద్యకు ప్రాధాన్యమివ్వాలి. స్వామి వివేకానంద బోధనలు ఐక్యతను, అవగాహనను పెంపొందించుకోవాలని, భారత యువత మీ శక్తికి అవధులు లేవు. ప్రతికూల పరిస్థితులను దృఢ సంకల్పంతో ఎదుర్కోండి, ఎదురుదెబ్బలు మిమ్మల్ని ముందుకు నడిపిస్తాయి. మనం జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పుడు, బాధ్యతాయుతమైన పౌరులుగా, కరుణామయ నాయకులుగా జీవితకాల అభ్యాసకులుగా, సామరస్యపూర్వక సంపన్న సమాజానికి దోహదపడతామని ప్రతిజ్ఞ చేద్దాం. లేవండి.. మేల్కొనండి.. లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగవద్దు.

డి.సుమంత్ కుమార్, వైద్యులు, ఆర్మూర్

ఆదర్శ జీవితం గడపాలి



నేటి యువత, విద్యార్థులు తాము ఆశయాన్ని ఏర్పరచుకొని దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆదర్శ జీవనం గడపాలి. దేశ నాయకులను ఆదర్శంగా తీసుకొని ఉన్నతులుగా ఎదగాలి.

రజనీకాంత్, వైద్యులు, ఆలూరు

విజయ్ హైస్కూల్లో

ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్


హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పట్టణంలోని విజయ హైస్కూల్ లో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు , ఉమ్మడి జిల్లాల జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్‌ని గురువారం నిర్వహించారు. ఈ ఎంపికకు నిజామాబాద్ జిల్లాలోని హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి విజయ్ హై స్కూల్ ప్రిన్సిపాల్ కవితా దివాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా హాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ , హ్యాండ్ బాల్ అసోసియేషన్ కోశాధికారి గట్టడి రాజేష్, హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, పిఈటిలు, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు రాహుల్ సాయి పాల్గొన్నారు. ఈ ప్రక్రియలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15,16,17 తేదీల్లో అసిఫాబాద్ లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ గర్ల్స్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులను ప్రయోజకులుగా మార్చేది ఉపాధ్యాయులే

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి


పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులను ప్రయోజకులుగా మార్చేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

జిల్లా తెలంగాణ గంగపుత్ర సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గంగపుత్రులకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో చేపల మార్కెట్ నిర్మించడానికి కేంద్ర బీజేపి ప్రభుత్వం 2 కోట్ల రూపాయల మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బింగి పెంటయ్య ప్రధాన కార్యదర్శి లింగం సలహా దారులు తోపారం రాజేశ్వర్ తోపారం శ్రీకాంత్ జిల్లామత్స్యపారి శ్రామిసహకార సంఘం నూతనంగా చీఫ్ ప్రమోటర్‌గా ఎన్నికైన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న స్ఫూర్తితో

కాంట్రాక్టర్ల నుండి వడ్డెర వృత్తిని కాపాడుకుందాం

- వడ్డెర వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 208వ జయంతి సందర్భంగా తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధ్యారంగుల కృష్ణ మాట్లాడుతూ ఓబన్న స్వాతంత్ర ఉద్యమ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గుట్టపై బండరాళ్లపై వేస్తున్న పన్నులకు వ్యతిరేకంగా వడ్డరులను ఐక్యం చేసి పోరాటం నిర్వహించారని అన్నాడు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని తరిమి వేయడానికి పోరాటం చేశాడని అన్నారు. గుట్టలపై బండరాళ్లపై కార్పొరేట్ కాంట్రాక్టు శక్తులు కన్ను వేసి వడ్డరులను బానిసలుగా తయారు చేశారని అన్నారు. ఓబన్న స్ఫూర్తితో వడ్డెరలకు గుట్టపై, క్వారీలపై, మట్టిపై అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన స్ఫూర్తితో ఒడ్డెరులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తుదారుల సంఘం అధ్యక్షుడు ఇడగొట్టి సాయిలు, పల్లపు వెంకటేష్, బడ్డెన్న, పాపన్న, రమేష్, గంగారం, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓబన్న జయంతిలో పాల్గొన్న వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు

రోగాల నివారణకు వ్యాక్సినేషన్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో గురువారం వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు వాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు గోరంత దగ్గ ధనుర్వాతం, ఆస్తమా లాంటి రోగాల నివారణకు ఈ వ్యాక్సినేషన్ పనిచేస్తుందని వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజు, ఆశా కార్యకర్తలు మాధురి, కృష్ణవేణి, పాఠశాల డైరెక్టర్లు కే.భానుచందర్ ఏ.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులపై విచారణ


విచారణ చేపడుతున్న ఆర్డీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామానికి చెందిన పాలెపు రాజేశ్వర్ ముఖ్యమంత్రి పేషీలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం గ్రామంలో ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ విచారణ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లలో అక్రమాలు, చెరువులు కుంటల చుట్టుపక్కల ఆక్రమణలు జరిగాయని పేర్కొంటూ రాజేశ్వర్ ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడు రాజేశ్వర్ సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలించి, పంచాయతీ పంచాయతీ కార్యదర్శి నర్సయ్యకు తగు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం సేకరించిన స్థలంలో ఎటువంటి పేపర్ కాని, ఎవిడెన్స్ లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని ఆదేశించారు. చెరువులు, కుంటలను ఇరిగేషన్, రెవెన్యూ అధికార్లు సర్వే నిర్వహించి మ్యాపులతో నివేదిక అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్డిఓ వెంట తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్, సర్వేయర్ బాలకృష్ణ, సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, గ్రామస్తులు ఉన్నారు.

వంద శాతం సబ్సిడీ రుణం అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

100శాతం వికలాత్వమున్న అమ్మాయికి 100శాతం సబ్సిడీపై రుణాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు గురువారం అందజేశారు. ఉమెన్స్ చిల్డ్రన్ డిజేబుల్, సీనియర్ సిటిజన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన బోదాసు గంగా జమున కు 100శాతం వికలాత్వము ఉన్నట్లు గుర్తించి 50వేల సబ్సిడీపై కిరాణ దుకాణం ఏర్పాటు కోసం అందజేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఓ బ్రహ్మానందం, మండల కో ఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, మండల ప్రజా పరిషత్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


సబ్సిడీ రుణం అందజేస్తున్న ఎంపీపీ

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- ఎంఈవో యం. శ్రీనివాస్

నవతెలంగాణ-సిరికొండ


విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎంఈవో

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి యం. శ్రీనివాస్ అన్నారు. జాతీయ తపాలాశాఖ తరపున గత సంవత్సరం అక్టోబర్ మాసంలో నిర్వహించిన పిలాటలి ఉపకారవేతనాల కొరకు 'దీన్ దాయల్ స్పార్శ్ యోజన' జనరల్ నాలెడ్జ్ పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచి ప్రాజెక్ట్ లెవెల్‌కు ఎంపికైన సత్యశోధక్ విద్యార్థులను గురువారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అభినందించారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు బి. భవ్యశ్రీ, పి. నవ్యశ్రీ, పి. సిద్ధార్థ, కె. రోహిత్, ఎ. శ్రీకాంత్, 6వ తరగతి విద్యార్థులు బి. నిధిరెడ్డి, యం. వర్షిత ఎంపికయ్యారు. వీరు మహాత్మాగాంధీ, కమ్యూనికేషన్ అభివృద్ధి, ఇస్రో, భారత స్వాతంత్రోద్యమం, భారతదేశ రక్షణలో సైనికుల పాత్ర మొదలగు అంశాలపై తపాలా శాఖ ముద్రించిన స్టాంపులను సేకరించి వాటి ప్రాముఖ్యతను తెలుపుతూ రూపొందించిన ప్రాజెక్ట్ లను మండల విద్యాధికారి యం. శ్రీనివాస్ పరిశీలించారు. తదనంతరం విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలను అందించి ప్రశంసించారు. విద్యార్థులు తపాలా సంస్థ ద్వారా ప్రయోజనాలను తెలుసుకొని సద్వినియోగం పరుచుకో వాలని, చదువుతో పాటు సామాజిక అవగాహనను కలిగివుండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

దంతాలను సంరంక్షించుకోవాలి

- డాక్టర్ శ్రీను నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రతి ఒక్కరూ తమ దంతాలను సంరంక్షించు కోవాలని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ శ్రీను నాయక్ అన్నారు. గురువారం డిచ్‌పల్లి మండలం లోని మెంట్రాజ్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీను నాయక్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత దంత శిబిరం నిర్వహించారు. అనంతరం దంతాలను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ దంతాలలో ఏమైనా లోపాలుంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి దంతాలను పరీక్షించుకుని వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్ షాట్‌పుట్‌లో కార్తీక్‌కు గోల్డ్ మెడల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



హైదరాబాద్‌లో నిర్వహించిన స్టేట్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్‌లో నిజామాబాద్ పాలిటెక్నిక్ బాయ్స్ కళాశాల నుండి స్టేట్ లెవెల్ షాట్‌పుట్ విన్నర్‌గా మొదటి బహుమతి గోల్డ్ మెడల్‌ని సాధించారని పాలిటెక్నిక్ బాలుర కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ తెలిపారు. హైదరాబాద్‌లోని రామంతపూర్‌లోగల జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీలలో పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఎలక్ట్రికల్ చదువుతున్న కార్తీక్ గెలుపొందడం సంతోషకరమైన విషయమని అన్నారు.



నిజామాబాద్ సిటీ : ఫ్యూచర్ లైన్ పాఠశాలలో చిన్నారుల సంబురాలు



ముప్కాల్: కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో...



కమ్మర్‌పల్లి: శ్రీ విద్యాసాయి పాఠశాలలో...



కంఠేశ్వర్: నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో...

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

- పతంగులు, ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- సంక్రాంత్రి విశిష్టతను వివరించిన కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్‌సిటీ: నగరంలోని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు రంగులతో ముగ్గులువేసి, డాన్స్‌చేసి టీచర్స్‌తో ఆనందం పంచుకున్నారు, విద్యార్థులను సంస్కృతి, సాంప్రదాయల గురించి తెలుసుకునే ఆవశ్యకత విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయలు శ్రీలత, సుమలత, మంజుల పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థుల నడుమ ఉపాధ్యాయులు సంక్రాంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమం ముగిసిన అనంతరం విద్యార్థులు సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు ఉండడంతో ఇళ్లకు వెళ్లారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.వినోద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. సంబురాల్లో భాగంగా విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను చాటిచెప్పే ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులందరు ఉల్లాసంగా పాఠశాల ఆవరణలో గాలి పటాల్ని ఎగురవేసి సంబురంగా వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా అలరించాయి. ఉపాధ్యాయులు విదార్థులకు సంక్రాంతి విషష్టతను వివరిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: నగరంలోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పండగ సాంప్రదాయ దుస్తులను ధరించారు. విద్యార్థులందరికీ ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు ఫాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు. అనంతరం చైర్మన్ సంతోష్ కుమార్ ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా అన్ని పండగలు జరుపుకుంటామని అన్నారు. సంక్రాంతి పండగ అనగానే తెలుగింటి ఆడపడుచుల పండుగలని, ఉదయాన్నే లేచి ఇంటిముందు రంగురంగుల హరివిల్లుల ముగ్గులు వేస్తారని అన్నారు. ఇల్లంతా కొత్త అల్లుళ్లతో నిండి పండగ వాతావరణం నెలకొంటుందని తెలిపారు. కొత్త సంవత్సరంలో మొదటగా వచ్చే ఈ మకర సంక్రాంతి తెలుగువారి అందరూ జరుపుకునే పండగ అని, కొత్త ధాన్యం ఇంటికి వస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో విజయం సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ టి.లత, వైస్ ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : మైచోట స్కూల్‌లో చిన్నారుల సంబురాలు



హోవర్డ్ హైస్కూల్‌లో చిన్నారుల సంబురాలు

బాల్కొండ: మండల కేంద్రంలోని శాంభవి హైస్కూల్ ఆధ్వ ర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు ఈ సం దర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, భోగి మంటలు, గాలి పటాలు ఎగరేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్ర మంలో చిన్నారుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించే విధంగా బాలికలు ముగ్గులను వేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవిన్ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినుల పాల్గొన్నారు.

సిరికొండ: మండలకేంద్రంలోని ప్రతిభ హైస్కూల్ లో విద్యార్థులకు కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో 1వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెన్స్ సుంకం హరీష్ శీతాకాలంలో చలి కారణంగా అనేక వ్యాధులు సంభవిస్తాయని అన్నారు. ఎండలో పతంగులు ఎగురవేసే సమయంలో సూర్యకిరణాలు శరీరంపై డైరెక్ట్‌గా పడడం వల్ల విటమిన్ డి.శరీరానికి అందడం వల్ల చర్మ వ్యాధులు దూరం అవుతాయన్నారు. స్వామి వివేకా నంద జయంతిని పురస్కరించుకొని ప్రతిభ పాఠశాలలో మండలంలోని మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఆసక్తిగల మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్ లలిత గౌతమి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: మండల కేంద్రం లోని శ్రీ వెంకటే శ్వర, మదర్ తెరిసా పాఠశా లల ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రెండు పాఠశాలల విద్యార్థినులు సంక్రాంతి పండుగ ప్రాముఖ్య తను వివరించే విధంగా రంగురంగుల ముగ్గులను వేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు కరస్పాండెంట్ కే.రామలక్ష్మి, హెడ్మాస్టర్లు కే.నరసింహారెడ్డి, కే సుబ్బారెడ్డి బహుమతులను అందజేశారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని నలంద ప్రైవేట్ పాఠశాలలో కరస్పాండెంట్ వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి తన్వీశ్రీ, ద్వితీయ బహుమతి కీర్తన, తృతీయ బహుమతి కుషిక గెలుచుకున్నారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయినీలు లక్ష్మి, రాజశ్రీ, శ్రీలక్ష్మి వ్యవహరించారు.



ఏర్గట్లలో..

కృష్ణవేణి పాఠశాలలో.....

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసి ఆనందంతో కేరింతలు వేశారు. అనంతరం విద్యార్థినిలు మహిళా ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో రంగులతో రంగోలి వేశారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు.సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అని అంటారని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సంక్రాంతి పండుగను ఘనంగా వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. సంక్రాంతి పండుగను భోగి, సంక్రాంతి, కనుమగా మూడు రోజులు జరుపుకుంటారని అన్నారు. మొదటిరోజు భోగిమంటలతో, రెండవ రోజు పొంగలి పిండి వంటలతో, పితృదేవతల, దేవుళ్ల పూజలతో, మూడవ రోజు గో పూజలతో ఎంతో ఆనందంగా జరుపుకుంటారని తెలిపారు. భోగి పండుగ నాడు పాత వస్తువులను దహనం చేయడం జరుగుతుందన్నారు. ఇక మంచి ఆలోచనతో క్రమశిక్షణతో చదువులో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిలుక గంగా ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలోని పలుపాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలుర, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ, విజయ్ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత దివాకర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పరిపాలన అధికారిని మానస పద్మ ఉపాధ్యాయ బృందం పాల్గొని సంబరాలు నిర్వహించారు. లిల్లీపుట్ పాఠశాలలో విద్యార్థులందరూ సాంప్రదాయక దుస్తులు వేసుకుని వచ్చారు. రంగురంగుల ముగ్గులతో పాఠశాల ఆవరణను చక్కగా అలంకరించారు పాఠశాల ప్రాంగణంలో బొమ్మల కొలువు కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులందరిపైన భోగి పండ్లు వేసి వారిని ఆశీర్వదించారు. విద్యార్థులందరూ గాలిపటాలు ఎగరవేశారు. అంతేకాకుండా పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేసి హరిదాసు వేషంతో జస్విన్ అనే విద్యార్థి అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నాడు. పిండి వంటకాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. పాలు పొంగించారు. విద్యార్థులందరూ చక్కని నృత్య ప్రదర్శన చేశారు.కరెస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగంపేట్: మండలం లోని ఆయా పాఠశాలలో గురువా రం పాఠశాలకు చెం దిన విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని శెట్టిపల్లి, సంగారెడ్డి ఉచ్చతర పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్ పల్లిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ



వేడుకలలో ప్రధా నోపాధ్యాయుడు దామోదర్ గంగిరె ద్దులోడు వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయిని పద్మ రూపొందించిన సంక్రాం తి సెట్ పల్లెటూరు వాతావరణాన్ని తలపించేలా పలువురిని ఆకట్టుకుంది. శెట్టిపల్లి సంగారెడ్డి పాఠశాలలో సంక్రాంతి సంబ రాల్లో భాగంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించా రు. విజేతలకు బహుమతులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దామోదర్ మాట్లాడుతూ.. ఈ విధంగా పాఠశాలలో ఉత్సవాల ను నిర్వహించుకోవడం వల్ల విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదా యాలు అలవడుతాయన్నా రు. పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి అనేక సంక్రాంతి పిండివంటల రుచులను ప్రదర్శిం చారు. భోగి మంటలు, హరి దాసు కీర్తనలతో ప్రాంగణమంతా మార్మోగింది. రంగవల్లిక పోటీలు నిర్వహించి విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, పతంగులు ఎగ ర వేస్తూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, లావణ్య, సుమలత, పద్మ, బన్సీ, జాకీ ర్, కవిత, సంగమేశ్వర్ గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.



బాల్కొండ: శాంభవి హైస్కూల్ పాఠశాలలో...



సిరికొండ: ప్రతిభ హైస్కూల్ పాఠశాలలో...



జక్రాన్‌పల్లి: తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో...



ఆర్మూర్‌లో...

ఏఐసిసి తెలంగాణ ఇన్చార్జి
దీపాదాస్ మున్సిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ దీపాదాస్ మున్సిని గురువారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏలేటి సంతోష్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ దీపదాస్ మున్షి ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావుతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి సంతోష్‌రెడ్డిని కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బరిలో ఉన్న అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలు గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తుందని అన్నారు. గ్రామగ్రామాన సదస్సులు నిర్వహించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని ఆమె సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండు గ్యారెంటీలు అమలు అయ్యాయని మరో నాలుగు గ్యారెంటీలు కచ్చితంగా అమలు అవుతాయన్నారు.



దీపాదాస్ మున్సిని కలిసిన ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు

నియోజకవర్గ అభివృద్ధికి 10 కోట్లు

- ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కొరకు రూ.10కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. ఈ నిధులతో నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగిస్తామని ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. గత పాలకుల ఆధ్వర్యంలో అభివృద్ధిలో వెనకబడిన ఎల్లారెడ్డి ప్రాంతానికి అభివృధి కొరకు 10కోట్ల రూపాయలు కేటాయించిన



సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లారెడ్డి ప్రజల తరపున ఎమ్మెల్యే మదన్మోహన్ ధన్యవాదాలు తెలిపారు. ని యోజకవర్గా లను తీర్చిదిద్దా లని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం రూపురేఖలు మారుస్తామని ముఖ్యమంత్రి అండతో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానన్నారు. నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆయన అన్నారు.